క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సామర్లకోట: పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పిఠాపురం రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్, జగనన్న కాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నామన్నారు. దీని వల్ల భాస్కర్‌నగర్, మాజేటి నగర్, సత్యనారాయణపురం, మెహర్‌కాంప్లెక్స్, గణపతి నగరం, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, అమ్మణమ్మ అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలన్నారు.

ఫేస్‌బుక్ టీం సేవలు అభినందనీయం



మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీంను అభినందిస్తూ భోజనం వడ్డిస్తున్న సభ్యులు

పెద్దాపురం: మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం సేవలు అభినందనీమని ఎస్ఐ మౌనిక అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం ప్రతి బుధవారం గర్భిణులకు అందించే ఆహారం పంపిణీ (మాతృత్వం) 53వ వారం కార్యక్రమాన్ని ఆమె సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ నిండు గర్భిణుల ఇబ్బందులను దష్టిలో ఉంచుకుని ఈ బృందం సభ్యులు చేస్తున్న సేవలు యువజన సంస్థలకు ఆదర్శమని అన్నారు. టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారం, టీమ్ సభ్యుల ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు



వీధి కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలకు సంతానోత్పత్తి నిరోధించే ఆపరేషన్లు చేస్తున్నట్లు కమిషనర్ కనకారావు తెలిపారు. బుధవారం కాకినాడకు చెందిన సొసైటీ ఫర్ నేచర్ అండ యానిమల్ ప్రొటెక్షన్ స్నాప్ వారి ఆధ్వర్యంలో యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో 20 వీధి కుక్కలను పట్టుకుని కాకినాడ కార్పొరేషన్ ఏబీసీ సెంటర్‌కు తరలించామన్నారు. వీధి కుక్కల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

వాకతిప్పలో ఏకాహం



సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కొత్తపల్లి: సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద బుధవారం ఏకాహం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు భజన సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా భజన బృందాల సభ్యులు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల సొమ్ము పోగొట్టుకుని ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోని వచ్చింది. వివరాల్లోకి వెళితే మండలంలోని పొన్నాడ శివారు రామన్నపాలేనికి చెందిన సింగిరిమళ్ల సూరిబాబు కొంతకాలంగా కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నాడు. ఇటీవల పొలం విక్రయించిన సొమ్ము కూడా బెట్టింగ్‌లో పోగొట్టుకోవడంతో కుటుంబ సభ్యులకు తెలిస్తే మర్యాద పోతుందని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో మంగళవారం తన ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అస్వస్థతకు గురైన సూరిబాబును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి సమాచరం అందలేదన్నారు.

చోరాగ్రేసరులు!

- పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- రాగి తీగల కోసం ప్రాణాలు పణం
- విద్యుత్ వైర్లు తొలగించి దుస్సాహసం
- అన్నదాతలకు తప్పని అవస్థలు



ఆర్‌బీ పట్నం పంట పొలంలో రాగి చోరీ కాగా మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్ అవశేషాలు

పెద్దాపురం: దొంగల్లోనూ ఎన్నో రకాలుంటారు. జేబుదొంగ, మంచిదొంగ, చిల్లరదొంగ, గజదొంగ, కర్కోటకదొంగ ఇలా ఎందరో.. ఎన్నిరకాలుగా ఉన్నా ప్రాథమికంగా మనిషన్నాక కొంత మానవత్వం ఉండాలి. చోర కళలో ప్రవీణుడైనా స్వలాభం కోసం చేసే పనుల్లో కాస్త విచక్షణ ఎంతైనా అవసరం. అన్నం పెట్టే రైతులకు ఎంతో ఉపయోగకరమైన విద్యుత్‌ను అందించే ట్రాన్స్‌ఫార్మర్లపైనా వారి దురాగతాలు ప్రదర్శిస్తున్నారు. వాటిలో విలువైన రాగి తీగలను సైతం దొంగిలించి సొమ్ముచేసుకుంటున్నారంటే ఎంత బాధాకరమో ఆలోచించాల్సి అవసరం ఎంతైనా ఉంది. అదే క్రమంలో అధికారులు సైతం ఆయా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండా చర్యలు తీసుకోవలసి ఆవశ్యకతను గుర్తించాలి.

ఇటీవల మండలంలో రాయభూపాలపట్నంలోని పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన రాగితీగ చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి అందులో రాగి వైరును అపహరించుకుపోయారు. ఇలాగే ఆరు నెలల కిందట గండేపల్లి మండలంలోనూ ఐదు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను దుండగులు దొంగలించారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు అందింది.

ఇటీవల పెద్దాపురం మండల పరిధిలోని మెట్ట గ్రామంలో పలు చోట్ల పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ చోరీకి గురవుతున్నాయి. ఏటా రబీలో పంట పొలాలకు నీరందించేందుకు రైతులు మోటార్లను అమర్చుకుంటారు. అర్ధరాత్రి పొలాల్లో దొంగలు చొరబడి వాటిని అపహరించి రాగిని దొంగిలిస్తున్నారు. చీకటిలో విద్యుత్ వైర్లను కట్ చేయడం ప్రాణాంతకమని తెలిసినా వెనక్కి తగ్గడం లేదు. ప్రస్తుతం వ్యవసాయానికి ఏడు గంటల మాత్రమే సరఫరా ఉంటుంది. అది కూడా రెండు విడతలుగా అందిస్తున్నారు. దీంతో విద్యుత్, రైతులు లేని సమయాల్లోనే దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఇటువంటి చోరీలు జరుగుతున్నా కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. పదేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చగా వాటిలో 14 కిలోల రాగి వస్తోంది. మార్కెట్‌లో కిలో రాగి ధర రూ.2500 పలుకుతోంది. దీంతో ఒకొక్క ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి దొంగిలిస్తే రూ.30 వేలకు పైగా సొమ్ము చేసుకోవచ్చని దొంగలు భావిస్తున్నట్లు తెలిస్తోంది. ఈ రాగిని బరంపురం, కటక్, జైపూర్ వంటి ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నట్లు సమాచారం. చోరీ నుంచి రాగి కొనుగోలు చేసే వరకు ఒక ముఠా నడుస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రైతులకు ఇబ్బందులే

సాధారణంగా 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు నాలుగు లక్షల వరకు ఉంటుంది. దీనిలో రాగి విలువ సుమారు 75 వేల వరకు ఉంటుంది. రాగి చోరీ కావడంతో దానికంటే తక్కువ ధరకు లభించే అల్యూమినియాన్ని విద్యుత్ శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్లలో అమరుస్తున్నారు. అలాగే దొంగలు కట్‌చేసిన విద్యుత్ వైర్లను అలానే వదిలేస్తుండడంతో పొరపాటున వాటిని తాకే రైతులు ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నారు. పదుల సంఖ్యలో రైతులు సొంత సొమ్ములు వేసుకుని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్న పరిస్థితి నియోజకవర్గంలో ఉంది. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులు రాయితీ పోను రూ.90 వేల వరకు కట్టాల్సి ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగితే సాగునీటి ఇబ్బందులతో పాటు తమపై అదనపు భారం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీస్ శాఖ దృష్టి సారించిన దాఖలాల్లేవని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాలకు అవకాశం



పొలాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తది అమర్చేసరికి చాలా సమయం పడుతోంది. ఇంతలో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. విద్యుత్ వైర్లు కత్తిరించడంతో చాలా చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న వారిని పోలీసులు అరెస్టు చెయ్యాలి

– నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

వేసవిలో పశు సంరక్షణ అవసరం

కొత్తపల్లి: వేసవి కాలంలో రైతులు పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. స్థానిక పశు వైద్య కేంద్రం వద్ద బుధవారం పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రత వల్ల వాతావరణ మార్పులతో పశువులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ప్రధానంగా గేదెలు, సంకరజాతి పశువులు వేసవి తీవ్రతను తట్టుకోలేవన్నారు. దీని వల్ల పాల ఉత్పత్తి తగ్గడం, ఎదుగుదల రాకపోవడం, ఎదకు వచ్చిన లక్షణాలు కనిపించకపోవడం తదితర సమస్యలు ఏర్పాడతాయన్నారు. సంకరజాతి విదేశీ ఆవులు ఎండ తీవ్రతకు గురై పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. మేత వేయకపోవడం, రొప్పడం, శరీర ఉష్ణోగ్రతలు బాగా పెరిగి రోగ నిరోధక శక్తి కోల్పోతాయన్నారు. పశువులను ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత మేతకు అనుకూల సమయమన్నారు. పశువులకు ఎల్లవేళలా చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని పశువులు నీరు తాగేకొద్దీ శరీరంలో వేడి తగ్గుతుందని ఆయన తెలిపారు. గేదెలను, పశువులను మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు చెరువుల్లో విడిచి పెట్టడం శ్రేయస్కరమని, చల్లని ప్రదేశాల్లో ఉంచాలన్నారు. పాలు తీసే ముందర పొదుగు, శరీరాన్ని చల్లని నీటితో శుభ్రం చేయడం వల్ల పాలు దిగుబడి పెరుగుతుందని ఆయన తెలిపారు.

ఎండీయూ రాక వినియోగదారుల అవస్థలు



23వ వార్డుకు చెందిన రేషన్ షాపు వద్ద బారులు తీరిన వినియోగదారులు

సామర్లకోట: స్థానిక 11 సచివాలయం పరిధిలో ఎండీయూ వాహనం రాక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. 22, 23 వార్డులకు చెందిన వినియోగదారులకు గత ఏడాది డిసెంబర్ నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. మార్చి నెలలో ఎండీయూ వాహనం వచ్చిందని, దాంతో ప్రతి నెల వాహనం వస్తుందనుకునే లోపు మళ్లీ నిలిపివేశారు. ఈ నెలలో వాహనం రాక పోవడంతో రేషన్ షాపు వద్ద బారులుతీయాల్సి వస్తోందని వాపోతున్నారు. మూడు రేషన్ షాపులకు బయోమెట్రిక్ మెషీన్ ఒకటే ఉండటంతో అందరికీ సరకులు అందడం లేదని తెలుస్తోంది. వార్డుకు కేవలం రెండు రోజులు మాత్రమే రేషన్ షాపు వద్ద సరకులు ఇస్తారని ప్రకటించడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. దాంతో బుధవారం సాయంత్రం రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు సరకుల కోసం వేచి ఉన్నారు. 23వ వార్డులోని మాజేటి నగర్, అప్పయ్య చెరువు, సత్యనారాయణపురం ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. స్థానిక 23వ వార్డుకు చెందిన రేషన్ షాపునకు జయలక్ష్మి థియేటర్ సమీపంలోని రేషన్ షాపు నుంచి సరకులు తీసుకోవలసి వస్తోంది. సత్యనారాయణపురం, మాజేటినగర్, అప్పయ్య చెరువు ప్రాంతాలకు చెందిన వారు ఈ రేషన్ షాపులకు వచ్చి సరకులు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల నుంచి రేషన్ షాపునకు వచ్చే మహిళలకు ఒక వైపు బార్, మరో వైపు రోడ్డులో బ్రాందీషాపు ఉండటంతో మందుబాబులతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని మహిళలు అంటున్నారు. దీనిపై తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిని సాక్షి వివరణ కోరగా ఎండీయూ వాహన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాలి

- రహదారి విస్తరణ పనులపై పిఠాపురం ప్రాంత ప్రజల డిమాండ్



బ్రౌన్‌పేట-పిఠాపురం రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాలు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని విద్యుత్ స్తంభాలను తొలగించి రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రోడ్డులో ఉన్న ఏలేరు కాలువపై ఉన్న ఇరుకు వంతెన కూలిపోవడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వంతెనకు రోడ్డు నిర్మాణానికి రూ.11.5 కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల పనులు సకాలంలో పూర్తి కాలేదు. వంతెన మాత్రమే పూర్తి చేశారు. గత కొన్ని రోజులుగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టారు. పిఠాపురానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పవన్ కల్యాణ్ నియోజకవర్గానికి వచ్చే సమయాల్లో సామర్లకోట నుంచి రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించే అవకాశం ఉండడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మొదటి పర్యటనలో రాజమహేంద్రవరంలో దిగిన పవన్ కల్యాణ్ కారులో రోడ్డు మార్గంలో పిఠాపురం వెళ్లారు. దాంతో అప్పటికప్పుడు అధికారులు ఆ మార్గంలో గోతులను యుద్ధ ప్రాతిపదికన పూడ్చారు. వారం రోజుల తరువాత గోతులు మళ్లీ మామూలైపోయాయి. దాంతో సామర్లకోట– పిఠాపురం రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. గతంలో నిర్ణయించిన విధంగా స్థానిక బ్రౌన్‌పేట వరకు రోడ్డు విస్తరణ జరుగుతోంది. అయితే బ్రౌన్‌పేట నుంచి విద్యుత్ స్తంభాలు రోడ్డు మార్జిన్‌లో ఉండడంతో అవి రహదారి విస్తరిస్తే మధ్యకు వచ్చే అవకాశం ఉంది. దీంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉండడంతో విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపి రహదారి విస్తరించాలని మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ఎంఆర్‌పీఎస్ నాయకుడు దూళ్లపల్లి రాజులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలు ఆపండి

- తహసీల్దారుకు కోదండ రామయ్య చెరువు నీటి సంఘం చైర్మన్ గొల్లపల్లి ఫిర్యాదు



కోదండ రామయ్య చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న కోదండ రామయ్య చెరువులో కొందరు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని వాటిని ఆపి చెరువును రక్షించాలని కోరుతూ చెరువు నీటి సంఘం చైర్మన్ గొల్లపల్లి కృష్ణ బుధవారం గొల్లప్రోలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతు తమ గ్రామంలో ఉన్న కోదండ రామయ్య చెరువు సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుందన్నారు. దాని లోతు ఇప్పటికే 8 అడుగులు ఉందని, దీనిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరపడం వల్ల చెరువు లోతు 20 అడుగులకు చేకుందన్నారు. దీంతో చెరువు ప్రమాద స్థితికి చేరుకుందని లోతు ఎక్కువగా ఉండడం వల్ల సాగునీరు బయటకు వచ్చే అవకాశం లేకుండా ఉందన్నారు. ఇటీవల కొన్ని రోజుల నుంచి కొందరు జేసీబీలతో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని ఆయన తెలిపారు. దీంతో చెరువు గర్భం మరింత లోతుగా మారి చెరువు మరింత ప్రమాద స్థితికి చేరుకుంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ శాంతికి ప్రార్థించండి



సదస్సులో ప్రసంగిస్తున్న దైవజనులు

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోసం ప్రతీ ఒక్కరూ ప్రార్థించాలని ప్రముఖ దైవజనురాలు డి.షారోన్ విలియమ్స్ అన్నారు. మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో బుధవారం స్త్రీల సదస్సు నిర్వహించారు. దైవజనురాలు వంకా రూత్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన సదస్సులో విలియమ్స్ మాట్లాడుతూ దేవుని ప్రేమ కరుణతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన అవసరం



ఉండూరు గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించిన ఎఫ్‌టీసీ డీడీ హరి

సామర్లకోట: రైతులు సేంద్రియ వ్యవసాయంపై మరింత అవగాహన పెంచుకోవాలని పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు బి.హరి అన్నారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా రంగ సంస్థ, మద్రాసు ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఏ రాష్ట్రం ఎంత మేరకు రసాయన ఎరువులు వాడకం తగ్గించిందో ఆయా రాష్ట్రాలకు 50 శాతం ఎరువులకు సబ్సిడీ విడుదలవుతుందని, ఆ మొత్తంతో రైతులకు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో ఆహార ఉత్పత్తులు నాణ్యతతో ఉండటం వలన ఆరోగ్యవంతంగా ఉంటాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమానికి ఎంఈఓ ఐ సత్య అధ్యక్షత వహించగా ఏడీఏలు మాధవి, రత్నప్రశాంతి, ప్రకృతి వ్యవసాయం ఏడీఏ ఏలియాజర్, మద్రాస్ ఫెర్టిలైజర్స్ రీజనల్ మేనేజరు ఎస్.చంద్రశేఖర్ అడిషనల్ మేనేజరు కిశోర్‌బాబు, ఏఓ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎద్దులు, గుర్రాలు సై అంటే సై

- చేబ్రోలులో పరుగు పందేలకు ఏర్పాట్లు
- 12, 13 తేదీల్లో నిర్వహణకు సమాయత్తం



పందేల కోసం చేబ్రోలు చేరుకున్న గుర్రాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రంకెలేసేందుకు ఎద్దులు సిద్ధమవుతుండగా, దౌడు తీసేందుకు గుర్రాలు సమాయత్తమవుతున్నాయి. చేబ్రోలు శ్రీసీతారామస్వామి వారి శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా స్థానిక జనసేన నేతల ఆధ్వర్యంలో 12వ తేదీన ఎడ్ల బళ్ల పోటీలు, 13న గుర్రాల పందేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చేబ్రోలులో ఏటా నవమి ఉత్సవాల్లో ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది జనసేన నేతలు రెండు వర్గాలుగా ఎద్దులు, గుర్రాల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఎద్దులు, గుర్రాలు చేబ్రోలు చేరుకుంటున్నాయి. మూడు రోజుల పాటు పందేలు జరిగే ప్రాంతాలను ఎడ్లకు గుర్రాలకు అలవాటు చేసేందుకే వాటిని ఇక్కడకు తీసుకువస్తున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

వివాదాల నేపథ్యంలో

జనసేన రెండు వర్గాల మధ్య అంతర్గత విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఎడ్లు, గుర్రాల పందేలపై సందిగ్ధత నెలకొందంటున్నారు. ఇరు వర్గాలు వివాదాలకు దిగే అవకాశం ఉండడంతో అనుమతులు నిరాకరించే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో పందాలు జరిగే అవకాశం లేక పోతే పందేలకు అనుమతి నిరాకరించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



రోగికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పిఠాపురం: అంబేద్కర్ జయంతి సందర్భంగా పిఠాపురం రథాలపేటలో బుధవారం ఏవైఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూ సమతా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు బి.విజయశేఖర్, సాల్మాన్‌రాజు, వినయ్, షారోన్, ప్రియాంక, రవితేజ తదితరులు రోగులను పరీక్షించి వైద్య సేవలందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవైఎం అసోసియేషన్ సభ్యులు జీహెచ్ నూకరాజు, సాకా వినయ్, కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లాంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

పిఠాపురం: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మల్లాం గ్రామంలో బుధవారం జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఈ పోటీలను ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీం సభ్యులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దాట్ల సూరిబాబు, ఎద్దు సుబ్రహ్మణ్యం, అంగుళూరు నూకరాజు, దుర్గాడ సత్తిబాబు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన తన 16 ఏళ్ల కుమార్తె కనిపించడం లేదని గొల్లప్రోలుకు చెందిన వరలక్ష్మి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, గొల్లప్రోలుకు చెందిన బాలిక ఈ నెల 4న బొమ్మూరు నేతాజీనగర్‌లో అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఈ నెల 8న గొల్లప్రోలుకు వెళుతున్నానని అమ్మమ్మకి చెప్పి బయలుదేరింది. తన కుమార్తె ఇప్పటివరకు ఇంటికి చేరలేదని వరలక్ష్మి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ స్టేడియం కోసం భూ పరిశీలన



సర్పవరంలో దేవస్థానం భూములను పరిశీలిస్తున్న కలెక్టరు షణ్మోహన్, ఎంపీ సతీష్

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన దేవస్థానం భూములను క్రికెట్ స్టేడియం నిర్మాణం నిమిత్తం కలెక్టరు షణ్మోహన్‌తో కలిసి ఎంపీ సానా సతీష్ బుధవారం పరిశీలించారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి కలెక్టరు భూములు పరిశీలించగా, మరో సారి ఎంపీ తదితరులతో పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఐపీఎల్ వంటి క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు కోరడంతో స్థలం కోసం జిల్లాలో స్థలానికి అన్వేషణ చేపట్టారు. తూరంగిలో ఇప్పటికే స్థలాన్ని పరిశీలించారు. తాజాగా సర్పవరం దేవస్థానం భూమలను చూస్తున్నారు. కాకినాడకు ఆనుకుని అందుబాటులో ఉండే భూములు వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఎంపీ, కలెక్టర్‌తో పాటు సర్పవరం భూముల పరిశీలనలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ నాయకులు జ్యోతుల నవీన్, వర్మ తదితరులు ఉన్నారు.

ఎలక్టోరల్ దరఖాస్తులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మల్లిబాబు

కాకినాడ రూరల్: భారత ఎన్నికల సంఘం ఆదేశం మేరకు నియోజకవర్గ పరిధిలోని సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో ఆర్డీఓ, ఎలక్టోరల్ అధికారి మల్లిబాబు బుధవారం సర్పవరం జంక్షన్‌లోని మండల పరిషత్ కార్యాలయ వద్ద సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫారం 6, 6ఎ, 7, 8 సవరణలకు సంబంధించి పెండింగ్‌లు, పోలింగ్ కేంద్రాల మార్పు, 1200 మంది ఓటర్ల కంటె ఎక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్ల గురించి ఓటర్ల సవరింపు తదితర అంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత లేని భద్రత!



పిఠాపురంలో ప్రమాదకర స్థితిలో విద్యార్థులను తరలిస్తున్న ఆటో

పిఠాపురం: పిఠాపురంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను పరిమితికి మించి ప్రమాదకర పరిస్థితుల్లో తరలిస్తున్నారు. ఒక ఆటోలో ఏకంగా 20 మంది పిల్లలను ఎక్కించడమే కాకుండా వారిని ప్రమాదకర స్థితిలో డోర్లపై కూర్చోబెట్టి తరలిస్తున్నారు. ఇటీవలే గొల్లప్రోలు మండలం చెందుర్తిలో స్కూలు వ్యాన్ కాలువలో పడి విద్యార్థులకు గాయాలైన నేపథ్యంలో ఇలాంటి తరలింపులపై పోలీసులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.